ఫ్లైఓవర్ మంజూరు పట్ల ఎంపీ వద్దిరాజు హర్షం

హైదరాబాద్ వెళ్లే ఖమ్మం ప్రయాణికుల కష్టాలకు చెక్

నితిన్ గడ్కరీకి కృతజ్ఞతలు తెలిపిన ఎంపీ

ఖమ్మం, ఆగస్టు 2 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఖమ్మం నుంచి హైదరాబాద్ వెళ్లే ప్రయాణికుల కష్టాలు త్వరలోనే తీరనున్నాయి. హైదరాబాద్- విజయవాడ రహదారి, ఖమ్మం రోడ్డును కలుపుతూ ఫ్లైఓవర్ నిర్మాణం కానున్నది. ఈ మేరకు బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర హర్షం వ్యక్తం చేస్తూ కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి శుక్రవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. వివరాల్లోకెళ్తే.. హైదరాబాద్-విజయవాడ 65వ నెంబర్ జాతీయ రహదారిని కలుపుతూ మూసీ నది బ్రిడ్జి దాటిన తర్వాత టేకుమట్ల సమీపంలో ఖమ్మానికి కొత్త రోడ్డు నిర్మాణం జరిగిన విషయం తెలిసిందే. అయితే, ఖమ్మం నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలు సూర్యాపేట వైపు రాయిని

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

గూడ గ్రామ సమీపానికి సుమారు రెండు కిలోమీటర్లు వెళ్లి యూటర్న్ తీసుకోవలసి వస్తున్నది. ఇది వాహనదారులకు ఇబ్బంది, ప్రమాదకరంగా మారింది. పలు ప్రమాదాలు సైతం చోటుచేసుకున్నాయి. ఈ బ్లాక్ స్పాట్ గురించి ఎంపీ వద్దిరాజు కేంద్ర ఉపరితల రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీని పలుమార్లు స్వయంగా కలిసి వినతిపత్రాలు ఇచ్చారు. ఎంపీ విజ్ఞప్తులను పరిశీలించిన కేంద్రమంత్రి ఫ్లైఓవర్‌ను మంజూరు చేశారు. దీని నిర్మాణ పనులను నేషనల్ హైవేస్ అథారిటీ(ఎన్‌హెచ్ఏ) త్వరలో చేపట్టనుంది.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పు స్వాగతనీయం

కేసీఆర్ హయాంలోనే అసెంబ్లీ తీర్మానం

మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు

ఖమ్మం వ్యవసాయం, ఆగస్టు 2 : ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు స్వాగతనీయమని, ఈ తీర్పును రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని బీఆర్ఎస్ నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నవంబర్ 2014న ఎస్సీ వర్గీకరణ చేయాలని నాడు తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ అసెంబ్లీలో తీర్మానం చేసి, వర్గీకరణ కోసం కేంద్రానికి పంపినట్లు నామా తెలిపారు. అప్పట్లో కేసీఆర్ ప్రధానమంత్రికి అనేక సార్లు లేఖలు రాశారని పేర్కొన్నారు. 17వ లోక్‌సభలో తాను ఎంపీగా ఉన్న సమయంలో విభజన హామీలు నెరవేర్చాలని, వెనుకబడిన కులాల జనగణన, బీసీల కేంద్రమంత్రిత్వశాఖ, ఎస్సీ వర్గీకరణ, మైనారిటీ రిజర్వేషన్ల పెంపుదల కోసం పోరాటం చేసినట్లు తెలిపారు. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు సమాజంలో సమానత్వం తీసుకొస్తుందని, కాలయాపన చేయకుండా కోర్టు తీర్పును వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని నామా డిమాండ్ చేశారు.

పాలకుల్లేని 'పల్లె' పాలన

- పంచాయతీల్లో పడకేసిన పారిశుధ్యం
- 'పల్లె ప్రగతి' కార్యక్రమానికి మంగళం?
- గ్రామాల్లో విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు
- ఇప్పటికే భారీగా విష జ్వరాల కేసులు
- మైలారంలో ఏకంగా 8 మంది మరణం
- గరీబ్ పేటలో పదుల సంఖ్యలో మృతులు?
- గ్రామాల్లో కానరాని బ్లీచింగ్, ఫాగింగ్
- కనీసం నిధుల ఊసే ఎత్తని కాంగ్రెస్ ప్రభుత్వం
- పారిశుధ్య కార్మికుల వేతనాలూ ఆలస్యం

బురదతో అపరిశుభ్రంగా ఉన్న రోడ్డు

భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 2 (నమస్తే తెలంగాణ):కొత్త సర్కారు కొలువుదీరి ఎనిమిది నెలలుగా అవుతున్నా పల్లెల్లో కొత్తగా వచ్చిన మార్పులేమీ కన్పించడం లేదు. పైగా అవి మునుపటి ప్రాభవాన్ని పూర్తిగా కోల్పోయాయి. గత కేసీఆర్ పాలనలో 'పల్లె ప్రగతి' పేరుతో వర్షాకాలమంతా కొనసాగిన కార్యక్రమానికి ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మంగళం పాడినట్లు కన్పిస్తోంది. పల్లెల్లో విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులే ఇందుకు తార్కాణంగా నిలుస్తున్నాయి. మొత్తంగా కొత్త ప్రభుత్వం పంచాయతీల్లో పారిశుధ్యం పడకేసింది. విష జ్వరాల కేసుల భారీ సంఖ్యలో నమోదవుతున్నాయి. లక్ష్మీదేవిపల్లి మండలం మైలారంలో ఇటీవల ఏకంగా 8 మంది మరణించడం, సుజాతనగర్ మండలం గరీబ్‌పేటలోనూ పదుల సంఖ్యలో విష జ్వరాల మరణాలు ఉన్నాయనే కథనాలు రావడం వంటి అంశాలు ఆందోళన కలిగిస్తున్నాయి. పంచాయతీల పాలకవర్గాల గడువు ముగిసి నెలలు గడుస్తున్నా పట్టించుకోని ప్రస్తుత ప్రభుత్వం.. ప్రత్యేక అధికారులతో పల్లె పాలనను నెట్టుకొస్తోంది. ఇక నిధుల ఊసు అసలే మరిచింది. కనీసం పారిశుధ్య కార్మికులకూ నెలల తరబడి వేతనాలు ఇవ్వడం లేదు. చివరికి గ్రామాల్లో బ్లీచింగ్, ఫాగింగ్ వంటి పారిశుధ్య, వ్యాధుల నివారణ చర్యలు కానరావడంలేదంటే పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

పడకేసిన పారిశుధ్యం..

పల్లెల్లో పారిశుధ్యం పూర్తిగా పడేకేసింది. మురుగునీరంతా వీధుల్లో ప్రవహిస్తుండడం, కొన్ని చోట్ల కాలువల్లో మురుగు పేరుకుపోవడం, ఓ వైపు దుర్గంధం వెదజల్లుతుండడం, మరోవైపు దోమలు విజృంభిస్తుండడం, బ్లీచింగ్, ఫాగింగ్ వంటివి కనీసంగా కూడా కానరాకపోవడం వంటి కారణాలతో పల్లె ప్రజలు విలవిల్లాడిపోతున్నారు. గడిచిన పదేళ్లుగా ఉన్న కేసీఆర్ ప్రభుత్వ పాలనలో ఇలాంటివేమీ మచ్చుకైనా లేవు. వర్షాకాలం ప్రారంభంలోనే పల్లె ప్రగతి కార్యక్రమాన్ని చేపట్టి పారిశుధ్యాన్ని మెరుగుపర్చారు. దీంతో వ్యాధుల జాడే కన్పించేది కాదు. కానీ ప్రస్తుత ప్రభుత్వంలో పల్లెల పరిస్థితి అందుకు పూర్తిగా భిన్నంగా ఉండడం గమనార్హం. ఇదే అంశంపై ఇటీవల జరిగిన జడ్పీ సమావేశంలోనూ బీఆర్ఎస్ జడ్పీటీసీలు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అయితే పంచాయతీ పాలనకు పెద్దదిక్కుగా ఉన్న డీపీవో పోస్టు ప్రస్తుతం ఇన్‌చార్జితోనే కొనసాగుతోంది. పంచాయతీ కార్యదర్శులు మాత్రమే రెగ్యులర్ పోస్టుల్లో ఉన్నారు. డీఎల్‌పీవోలు, ఎంపీవో పోస్టులు కూడా ఇన్‌చార్జులతోనే కొనసాగుతున్నాయి. దీంతో పల్లె పాలన గాడితప్పుతోంది.

జ్వరాలు ఫుల్.. నిధులు నిల్..

పారిశుధ్యంపై అధికారులు దృష్టి పెట్టకపోవడంతో పల్లెల్లో జ్వరాలు విజృంభిస్తున్నాయి. జ్వరాల కారణంగా లక్ష్మీదేవిపల్లి మండలం మైలారంలో ఇటీవల 8 మంది చనిపోయారని అక్కడి జడ్పీటీసీ ఇటీవలి జడ్పీ సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఇక సుజాతనగర్ మండలం గరీబ్‌పేటలో కూడా జ్వరాల మృరణాలు పదుల సంఖ్యలో ఉన్నాయి. దీంతో వైద్యశాఖ అధికారులు అక్కడ వైద్య శిబిరాలు ఏర్పాటుచేశారు. కానీ అంతకుముందు పంచాయతీ అధికారులు అక్కడ పారిశుధ్య పనులు చేపట్టి ఉంటే ఇన్ని మరణాలు సంభవించేవి కావంటూ అక్కడి ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక ప్రభుత్వం నుంచి నిధులురాని కారణంగా పల్లెలన్నీ చిన్నబోతున్నాయి. గతంలో చేసిన పనుల బిల్లులను కూడా ప్రస్తుత ప్రభుత్వం విడుదల చేయడం లేదు. పన్నుల వసూళ్లు అంతంతమాత్రంగానే ఉంది. తాగునీటి సమస్య వచ్చినప్పుడు ఒక్కోసారి తాము సొంతంగా ఖర్చులు భరించాల్సి వస్తోందని కొందరు కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు దృష్టిపెట్టాలి..

పారిశుధ్యంపై అధికారులు దృష్టిపెట్టాలి. జిల్లా పంచాయతీ అధికారి అన్ని పంచాయతీలను పరిశీలిస్తే సమస్య తీవ్రత ఏంటో తెలుస్తుంది. ప్రతీ జడ్పీ సమావేశంలోనూ సమస్యల గురించి చెబుతున్నా అధికారులెవరూ పట్టించుకోవడం లేదు. అసలు నిధులు లేకుండా పాలన ఎలా జరుగుతుంది? రోజూ పనిచేయించుకుంటూ కార్మికులకు వేతనాలు ఇవ్వకపోవడం దారుణం.

-మేరెడ్డి వసంత, జడ్పీటీసీ, లక్ష్మీదేవిపల్లి

పంచాయతీలపై ప్రభుత్వానికి శ్రద్ధ లేదు..

జిల్లాలోని పల్లెల్లో పారిశుధ్యం పడకేసింది. గత కేసీఆర్ ప్రభుత్వ పాలనలో పల్లెలు పట్టణాలతో పోటీపడేవి. కానీ ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో ఆ పరిస్థితి లేదు. ఈ పల్లెలను ఈ ప్రభుత్వం పూర్తిగా పట్టించుకోవడం లేదు. పంచాయతీ ఎన్నికలు పెట్టలేదు. పంచాయతీలకు నిధులు ఇవ్వడం లేదు. ఈ నేపథ్యంలో పల్లెల సమస్యల పరిష్కారం కోసం ఆందోళనలు చేస్తాం. పారిశుధ్య సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తాం.

-రేగా కాంతారావు, బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు

ఆశ్రమ టీచర్లు పనితీరు మార్చుకోవాలి

విద్యాబోధనపై ప్రత్యేక దృష్టి సారించండి..

భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్

మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో రాహుల్

బూర్గంపహాడ్, ఆగస్టు 2 : గిరిజన సంక్షేమ శాఖలో విధులు నిర్వర్తిస్తున్న హెచ్ఎంలు, ఉపాధ్యాయుల పనితీరు బాగోలేదని, వెంటనే తీరు మార్చుకొని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఐటీడీఏ పీవో రాహుల్ ఆదేశించారు. శుక్రవారం ఐటీడీఏలోని తన ఛాంబర్‌లో ఏటీడీవోలు, ప్రత్యేకాధికారులతో పాఠశాలల పనితీరుపై ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో హెచ్ఎంలు, ఉపాధ్యాయుల మధ్య సమన్వయం లేకపోవడంతో విద్యాబోధన సరిగా జరగడంలేదని, కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల చేత పనులు చేయిస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. హెచ్ఎంల అనుమతి లేకుండా విద్యార్థినులు వెళ్లిపోవడం, పరిశుభ్రత పట్ల శ్రద్ధ తీసుకోకపోవడం తదితర విషయాలు తన దృష్టికి వచ్చాయని, వీటిపై ఏ సమాచారం వచ్చినా ముందుగా ట్రైబల్ వెల్ఫేర్ డీడీ ద్వారా తన దృష్టికి తేవాలని సూచించారు. కొన్ని పాఠశాలల్లో పిల్లలకు గైడ్ల ద్వారా పరీక్షలు నిర్వహిస్తున్నారని, తనిఖీల సమయంలో ఈ విషయం తన దృష్టికి వచ్చిందని, ఇకపై ఆ విధానాన్ని మానుకోవాలని హెచ్చరించారు. కొన్ని పాఠశాలల్లో మెనూ సక్రమంగా పాటించడం లేదని, దీనిపై డీడీ, ఏటీడీవోలు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మళ్లీ సమావేశం నాటికి పూర్తి నివేదికలతో రావాలని, ఏ పాఠశాల నుంచైనా, ఎవరి ద్వారానైనా ఫిర్యాదులు అందితే ఏటీడీవో, హెచ్ఎం, సబ్జెక్టు టీచర్లపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఐటీడీఏ జనరల్ డేవిడ్‌రాజ్, డీడీ మణెమ్మ, విజయలక్ష్మి, ఈఈ తానాజీ, ఏడీ భాస్కర్, ఏసీఎంవో రమణయ్య, డీటీఆర్ వోఎఫ్ఆర్ శ్రీనివాస్, ఏటీడీవోలు జహీరుద్దీన్, సత్యవతి, అశోక్, చంద్రమోహన్, రాధమ్మ, జీసీడీవో మంగతాయారు, జేడీఎం హరికృష్ణ, డీఈ, ఏఈలు పాల్గొన్నారు.

22 మంది బాలలకు విముక్తి : భద్రాద్రి ఎస్పీ

కొత్తగూడెం క్రైం, ఆగస్టు 2 : ఆపరేషన్ 'ముస్కాన్-X'లో భాగంగా జిల్లాలో 22 మంది బాలలకు విముక్తి కలిగించినట్లు ఎస్పీ బిరుదరాజు రోహిత్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో భాగంగా జిల్లావ్యాప్తంగా అన్ని శాఖల సమన్వయంతో బాలబాలికలను వారి తల్లిదండ్రుల చెంతకు చేర్చినట్లు పేర్కొన్నారు. ఆపరేషన్ ముస్కాన్ కోసం 5 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని, జూలై 1వ తేదీ నుంచి 31 వరకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో 20 మందిని వారి తల్లిదండ్రుల వద్దకు, ఇద్దరిని బాలుర సంరక్షణ కేంద్రానికి తరలించినట్లు పేర్కొన్నారు. పిల్లలను పనిలో పెట్టుకున్న 20 మందిపై కేసులు నమోదైట్లు తెలిపారు. ఎవరైనా పిల్లలను పనిలో పెట్టుకున్నట్లు తెలిస్తే డయల్ 100కు ఫోన్ చేసి వెంటనే సమాచారం ఇవ్వాలని తెలిపారు. కాగా.. బాల కార్మికులను తల్లిదండ్రుల వద్దకు చేర్చిన బృందాలను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

వర్షపు నీటిని ఒడిసి పట్టేందుకు.. ఇంకుడు గుంతలు తప్పనిసరి

వాటి కోసం సిమెంట్ ఒరలు ప్రత్యేకంగా తయారుచేయాలి

చుంచుపల్లి పర్యటనలో భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్

సిమెంట్ ఒరలను పరిశీలించి మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

చుంచుపల్లి, ఆగస్టు 2 : వర్షపు నీటిని ఒడిసి పట్టేందుకు ఇంకుడు గుంతల నిర్మాణం తప్పనిసరి అని భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ పేర్కొన్నారు. ఇందుకోసం సిమెంట్ ఒరలు ప్రత్యేక డిజైన్‌లో తయారు చేయాలని సూచించారు. ఈ నెల 5 నుంచి 9 వరకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న 'స్వచ్ఛదనం - పచ్చదనం' కార్యక్రమంలో భాగంగా చుంచుపల్లి మండలంలో శుక్రవారం ఆయన పర్యటించారు. వర్షాలు కురుస్తున్నందున రహదారుల వెంబడి, గ్రామాల్లో రోడ్ల వెంబడి గుంతలు ఏర్పడుతున్నాయని, వాటిల్లో నీళ్లు నిలుస్తున్నాయని అన్నారు. వాటి వల్ల వాహనదారులు, పాదచారుల రాకపోకలకు ఇబ్బందులు కులుగుతున్నాయని అన్నారు. అదీగాక ఆ గుంతల్లో దోమలు వ్యాప్తి చెంది విష జ్వరాలకు కారణమవుతున్నాయని గుర్తుచేశారు. ఈ ఇబ్బందులను తొలగించేందుకు ఇంకుడు గుంతల నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. పర్యటనలో భాగంగా చుంచుపల్లి మండలంలో ఓ సిమెంట్ ఒరల తయారీ షాపును సందర్శించిన కలెక్టర్.. అక్కడి ఒరలను పరిశీలించారు. వర్షపు నీటిని ఒడిసి పట్టేందుకు వీలుగా ఒరలు, వాటిపై మూతల తయారీలో కొన్ని మార్పులను సూచించారు. ఒకటి సెట్‌ను నమూనాగా తయారు చేసి ఇవ్వాలని సదరు ఒరల తయారుదారుణ్ని కోరారు. డీఆర్‌డీవో విద్యాచందన, తహసీల్దార్ పూనెం కృష్ణ, ఎంపీడీవో అశోక్‌కుమార్, ఎంపీవో గుంటి సత్యనారాయణ, ఏపీవో ఈజీఎస్ రఘుపతి, ఈసీ పిల్లి నాగరాజు, పంచాయతీ కార్యదర్శులు సత్యనారాయణ, భూమిక తదితరులు పాల్గొన్నారు.

ముర్రుపాలే బిడ్డకు రక్షణ

ఖమ్మం కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్

నగరంలో అవగాహన ర్యాలీ

ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్

ఖమ్మం సిటీ, ఆగస్టు 2 : ప్రసవం జరిగిన గంటలోపే ప్రతి బిడ్డకు పాలు పట్టించాలని, అవే వారికి రక్షణ కల్పిస్తాయని ఖమ్మం కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా జిల్లా ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీని నగరంలోని పెవిలియన్ గ్రౌండ్ వద్ద శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే వారం రోజులపాటు బిడ్డకు పాలివ్వడం, తద్వారా కలిగే ప్రయోజనాల గురించి తల్లులందరికీ అవగాహన కల్పించాలని వైద్యాధికారులకు సూచించారు. అనంతరం పెద్దాసుపత్రి వరకు నిర్వహించిన ర్యాలీలో పాల్గొని స్ఫూర్తిని నింపాచరు. అక్కడ ఎంసీహెచ్ భవనంలోని మీటింగ్ హాల్‌లో నిర్వహించిన సదస్సులో డీఎంహెచ్‌వో డాక్టర్ బీ.మాలతి మాట్లాడారు. పుట్టిన బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం వల్ల ఇమ్యూనిటీ పెరుగుతుందని, తద్వారా పిల్లలు వ్యాధుల బారిన పడకుండా కాపాడుకోవచ్చన్నారు. ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు మాట్లాడుతూ ప్రసవం తర్వాత పాలు పట్టించాలని నర్సులు చెబుతున్నారని, వారి మాటలను తల్లులు తప్పక పాటించాలని కోరారు. అనంతరం కళాకారులు తల్లిపాల వల్ల కలిగే ప్రయోజనాల గురించి ఆటపాటలతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చిన్నపిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ కూరపాటి ప్రదీప్, అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ శిరీష, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సైదులు, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ చందునాయక్, డాక్టర్ వెంకటరమణ, పెద్దాసుపత్రి ఆర్ఎంవో డాక్టర్ రాథోడ్, చిన్నపిల్లల విభాగం హెచ్‌వోడీ డాక్టర్ బాబూరత్నాకర్, ప్రైవేట్ వైద్యులు వంశీధర్, నాగమణి, డెమో సాంబశివారెడ్డి, సూపర్‌వైజర్లు శ్రీకాంత్, జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

'చలో అసెంబ్లీ' అడ్డగింత

- పెండింగ్ బిల్లుల కోసం హైదరాబాద్‌కు బయలుదేరిన మాజీ సర్పంచ్‌లు
- విషయం తెలుసుకొని ఎక్కడికక్కడ అదుపులోకి తీసుకున్న పోలీసులు

పోలీసుల అదుపులో ఉన్న మాజీ సర్పంచ్‌లు

రఘునాథపాలెం/పెనుబల్లి/ ఖమ్మం రూరల్, ఆగస్టు 2: పెండింగ్ బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేస్తూ మాజీ సర్పంచ్‌లు తలపెట్టిన 'చలో అసెంబ్లీ' కార్యక్రమాన్ని జిల్లా పోలీసులు అడ్డగించారు. మాజీ సర్పంచ్‌లందరూ హైదరాబాద్‌కు బయలుదేరారని తెలుసుకున్న పోలీసులు.. వారిని ఎక్కడికక్కడ అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్లకు తరలించారు. రఘునాథపాలెం, పెనుబల్లి మండలాల నుంచి బయలుదేరిన మాజీ సర్పంచ్‌లను అదుపులోకి తీసుకున్నారు. రఘునాథపాలెం మండలం నుంచి రాజధానికి పయనమై వెళ్తున్న మాజీ సర్పంచ్‌లను ఆ మండల పోలీస్‌స్టేషన్‌కు తరలించిన సందర్భంగా సర్పంచ్‌ల (మాజీ) సంఘం మండల అధ్యక్షుడు మాదంశెట్టి హరిప్రసాద్ మాట్లాడారు. తాము సర్పంచ్‌గా ఉన్న సమయంలో గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం పనులను త్వరగా పూర్తి చేసేందుకు తమ సొంత నిధులు వెచ్చించామని అన్నారు. అయితే నెలల తరబడి ఎదురుచూస్తున్నా ప్రభుత్వం తమ బిల్లులు చెల్లించడం లేదని, కనీసం వాటిపై స్పందించడం లేదని ఆరోపించారు. కొన్నిచోట్ల వడ్డీలకు తెచ్చి పనులు పూర్తి చేసినందుకు వెంటనే తమకు ఆ పెండింగ్ బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆయా మండలాల నుంచి పోలీసుల అదుపులో ఉన్న మాజీ సర్పంచుల్లో చెరుకూరి ప్రదీప్, కొర్లపాటి రామారావు, షేక్ మీరా సాహెబ్, గుగులోతు మోతీలాల్, ధరావత్ పాండు తదితరులు ఉన్నారు. ఖమ్మం రూరల్‌కు చెందిన బీఆర్ఎస్ మాజీ సర్పంచ్‌లు వెంకటరమణ, తాటికొండ సుదర్శన్, బాలునాయక్‌లను ఎస్సై రామారావు ముందస్తు అరెస్ట్ చేశారు.

వీఎం బంజర పోలీసుల అదుపులో ఉన్న మాజీ సర్పంచ్‌లు, ఖమ్మం రూరల్ పోలీసుల అదుపులో..

5 నుంచి 'స్వచ్ఛదనం-పచ్చదనం'

జిలావ్యాప్తంగా 9 వరకూ కార్యక్రమాలు నిర్వహించాలి

శిథిల భవనాలు కూల్చాలి.. పారిశుధ్య పనులు చేపట్టాలి

అధికారుల వీడియో కాన్ఫరెన్స్‌లో భద్రాద్రి కలెక్టర్ జితేశ్

భద్రాద్రి కొత్తగూడెం, నమస్తే తెలంగాణ/మామిళ్లగూడెం, ఆగస్టు 2 : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమాన్ని ఈ నెల 5 నుంచి 9 వరకు జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామాల్లోనూ నిర్వహించాలని భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ సూచించారు. ఈ కార్యక్రమం కింద గ్రామాలు, పట్టణాల్లో చేపట్టాల్సిన కార్యక్రమాల వివరాలు, తీసుకోవాల్సిన చర్యలపై జిల్లాలోని వివిధ శాఖల అధికారులతో కలెక్టరేట్ నుంచి శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఈ నెల 5న 'మన బాధ్యత' కార్యక్రమం పేరిట ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలతోపాటు ఇతర ప్రజా సంచార ప్రాంతాల్లో ప్రజలు, అధికారుల భాగస్వామ్యంతో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. 6న 'నీళ్లు పట్టేద్దాం.. నీటిని కాపాడుదాం' కార్యక్రమం పేరిట గ్రామాల్లోని అన్ని తాగునీరు ట్యాంకులను శుభ్రం చేయాలని, మొక్కలు నాటాలని ఆదేశించారు. 7న 'సరిచేద్దాం' కార్యక్రమం పేరిట మురుగు కాలువల్లోని పూడికతీత పనులు చేపట్టాలని, రహదారుల మధ్య ఏర్పడిన గుంటలను పూడ్చాలని సూచించారు. 8న 'ఆరోగ్యమే మహాభాగ్యం' పేరిట జ్వర సర్వే నిర్వహించాలి. వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. 9న 'స్వచ్ఛ కార్యాలయం/నివాసం-అందరికీ స్వాగతం' పేరిట శిథిల భవనాలు, కార్యాలయాలను కూల్చివేయాలని, ప్రభుత్వ కార్యాలయాలను శుభ్రం చేయాలని సూచించారు. అదనపు కలెక్టర్లు డీ.వేణుగోపాల్, విద్యాచందన, అధికారులు అర్జున, భాస్కర్‌నాయక్, పురందేశ్వరరావు, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతో చేపట్టాలి: ఖమ్మం కలెక్టర్

ఈ నెల 5 నుంచి 9 వరకు చేపట్టనున్న 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమాన్ని ప్రజల భాగస్వామ్యంతో పకడ్బందీగా చేపట్టాలని ఖమ్మం కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ అధికారులకు సూచించారు. 'స్వచ్ఛదనం-పచ్చదనం'పై జిల్లాలోని అన్ని శాఖల అధికారులతో ఖమ్మం కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమం కింద ఇంటి స్థాయి నుంచి కమ్యూనిటీ స్థాయి వరకు మొక్కలు నాటాలని సూచించారు. ప్రజలు, స్థానిక నాయకులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, యువకులు, వార్డు కమిటీల బాధ్యులను భాగస్వామ్యం చేస్తూ మొదటి రోజు నుంచి చివరి రోజు వరకూ నిర్ణీత కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశించారు. ర్యాలీలు, సమావేశాలు నిర్వహించి పారిశుధ్యం, ప్లాస్టిక్ వినియోగం, సీజనల్ వ్యాధులు, ప్రజా, ప్రభుత్వ స్థలాల పరిశుభ్రత వంటి కార్యక్రమాలను షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలని సూచించారు. శిక్షణ సహాయ కలెక్టర్ మిర్నల్ శ్రేష్ఠ, జిల్లా అధికారులు సన్యాసయ్య, వినోద్, హరికిషన్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దాసుపత్రి ఆర్ఎంవోగా కళావతిబాయి బాధ్యతల స్వీకరణ

ఖమ్మం సిటీ, ఆగస్టు 2 : జిల్లా సార్వజనీన ఆసుపత్రి ఆర్ఎంవోగా డాక్టర్ కళావతిబాయి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్.కిరణ్‌కుమార్, ఆర్ఎంవోలు డాక్టర్ రాంబాబు, డాక్టర్ రాథోడ్, ల్యాబ్ టెక్నీషియన్ నందగిరి శ్రీనివాస్, పలువురు వైద్యులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. సమష్టిగా పనిచేసి నిరుపేదలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తామని ఆమె ఈ సందర్భంగా తెలిపారు.

ఆర్ఎంవో డాక్టర్ కళావతిబాయికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న వైద్యులు

మెడికల్ కళాశాల నిర్మాణానికి 35 ఎకరాలు

రఘునాథపాలెంలో ప్రభుత్వ భూమికి మంత్రివర్గ ఆమోదం

త్వరలోనే నిర్మాణపనులు ప్రారంభిస్తాం : మంత్రి తుమ్మల

భవన నిర్మాణ మ్యాపును పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మం వ్యవసాయం, ఆగస్టు 2 : ఖమ్మం జిల్లాలో నిర్మించతలపెట్టిన ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మాణానికి రఘునాథపాలెంలో 35 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయిస్తూ ఈ నెల 1వ తేదీన జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం మెడికల్ కళాశాలకు సంబంధించిన స్థలం, భవననిర్మాణ మ్యాపులను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హైదరాబాద్‌లోని తన చాంబర్‌లో పరిశీలించారు. ఆధునాతన సౌకర్యాలతో మెడికల్ కళాశాల నిర్మాణ పనులు అతిత్వరలోనే చేపట్టి, వచ్చే విద్యా సంవత్సరం నాటికి అందుబాటులోకి తీసుకొస్తామని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు.

మెడికల్ కళాశాల భవనం (నమూనా చిత్రం)